క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన అరకు ఎంపీ అభ్యర్థి



ఎమ్మెల్యే జోగారావుతో అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణి

పార్వతీపురం టౌన్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును వైఎస్సార్ సీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజారాణి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి, పార్వతీపురం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజార్టీ వస్తుందని, ఎంపీగా గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి వినయ్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ



మాట్లాడుతున్న ఎంపీడీవో ఈశ్వరరావు

సీతానగరం: ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు ఏప్రిల్ నెల సామాజిక పింఛన్లను గ్రామ సచివాలయాల ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఇదివరకు ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ జరిగేదని, ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రస్తుతానికి సచివాలయ ఉద్యోగులతో పింఛన్ల పంపిణీకి నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

నేడు ఆలయ ప్రారంభోత్సవం



ప్రారంభానికి సిద్ధమైన కనకదుర్గమ్మ ఆలయం

మెంటాడ: మండలంలోని కుంటినవలస గ్రామంలో కొత్తగా నిర్మించిన కనకదుర్గమ్మ ఆలయ ప్రారంభోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఆలయ ప్రారంభంతో పాటు ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కూడా ఉంటుందని, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

శరవేగంగా ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు



బుడ్డిపేట వద్ద సిద్ధం చేసి ఉంచిన పైపులు

సీతానగరం: మండలంలోని పెదబోగిలి పంచాయతీ, అప్పయ్యపేటలో ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ అన్నారు. కాంట్రాక్టర్ అచ్యుతరావుతో కలిసి ఆయన కాలనీ రోడ్డులో జరుగుతున్న కుళాయిల ఏర్పాటు పనులను ఆదివారం పరిశీలించారు. వారం రోజుల్లోగా ప్రతీ ఇంటికి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. ఇప్పటికే ట్యాప్ పాయింట్లు కూడా వేయడం జరిగిందన్నారు. త్వరలోనే బుడ్డిపేటలో కూడా ఇంటింటి కుళాయి నిర్మాణ పనులు చేపడతామని, అందుకు అవసరమైన పైపులు, ఇతర సామగ్రి సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు గడువు పెంపు

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో ప్రవేశాలకు సంబంధించి, ప్రభుత్వం గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గతంలో తెలపగా, విద్యార్థుల కోసం ఈ గడువును ఏప్రిల్ ఆరో తేదీ వరకు పెంచిందని, ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆన్‌లైన్‌లో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీతోనే రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం
- టీడీపీ కూటమి నేతల మాయమాటలు నమ్మొద్దు
- ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. ఆదివారం స్థానిక పట్టణంలోని 17వ వార్డు పరిధిలో ఉన్న అక్కేన, అల్లు, గూడెపు వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయనకు అక్కడి వారు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు అండగా నిలుస్తూ, అర్హతే ప్రామాణికంగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. ప్రతీ ఇంటికి ఆయన ఓ పెద్దకొడుకులా అండగా నిలిచారని ప్రశంసించారు. 2014 ఎన్నికల్లో మోసపూరిత హామీలు ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చినాక ఆ హామీలను అమలు చేయకుండా మహిళలు, రైతులు, యువత తదితర వర్గాలను చంద్రబాబు మోసం చేశారని విమర్శించారు. 2019 ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతగా భావించి, అందులోని ప్రతీ హామీని అమలు చేసిన ఘనత సీఎం జగనన్నదేనన్నారు. ప్రజలకు మంచి చేయడం జగన్ అజెండా అని, ప్రజలను మోసం చేయడమే టీడీపీ కూటమి అజెండా అని, టీడీపీ కూటమి నేతల మాయమాటలు నమ్మవద్దన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్న సుపరిపాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించి, మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు, నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, గిరిరఘు, గొర్లె మాధవరావు, గులిపల్లి నాగ, రాపాక మాధవరావు, గొర్లె వెంకటరమణ, కర్రి మహేష్, జి.రమేష్, జె.రమేష్, ఎర్రదాలినాయుడు, అక్కేన సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: రానున్న ఎన్నికల్లోనూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమమే మళ్లీ పార్టీని విజయం వైపు నడిపిస్తాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక పట్టణంలోని సంకావీధిలో ఆదివారం నిర్వహించిన మేమంతా సిద్ధం కార్యక్రమానికి హాజరైన ఆయన రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. 2014 ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రజలకు హామీలు ఇచ్చి, విస్మరించడంతోనే ఆయనకు 2019 ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. 2019 ఎన్నికల్లో జగనన్న ఇచ్చిన హామీలతో పాటు ఆయన ముఖ్యమంత్రి అయిన తర్వాత ఇచ్చిన మరెన్నో హామీల్లో ప్రతీ హామీని నెరవేర్చి, ప్రజల హృదయాల్లో సుస్థిరమైన స్థానం సంపాదించుకున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు. ఆయా వ్యవస్థలతో గ్రామస్వరాజ్యం తీసుకువచ్చారన్నారు. ఎన్నికల వేళ మరోసారి మాయమాటలతో ప్రజలకు ముందుకు వచ్చే టీడీపీ కూటమి నేతలను నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యే అలజంగి జోగారావును మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు పార్టీ నేతలు, కార్యకర్తలంతా సైనికుల్లా పనిచేయాలని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కోరారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన లబ్ధిని, ప్రయోజనాన్ని, మంచిని ఇంటింటికీ వెళ్లి, వివరించాలన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతీ గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గుణేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, స్థానిక కౌన్సిలర్లు మంత్రి ఉమా మహేశ్వరి, పోల సత్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.

పేదలంటే చంద్రబాబుకు చులకన

- డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



సాలూరు: పేదలంటే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు చాలా చులకనభావమని, పేదలకు మేలు జరిగే కార్యక్రమాలను అడ్డుకోవడం ఆయన నైజమని డిప్యూటీ సీఎం, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర విమర్శించారు. స్థానిక పట్టణంలోని ఆయన స్వగృహంలో విలేకరులతో ఆదివారం మాట్లాడిన ఆయన ప్రతినెలా లబ్ధిదారుల వద్దకే పింఛన్లు అందిస్తున్న వలంటీర్ల సేవలను అడ్డుకునే ప్రయత్నం చంద్రబాబు అండ్ కో ప్రయత్నిస్తున్నారన్నారు. వలంటీర్ల ద్వారా ప్రజలకు మంచి జరిగే కార్యక్రమాన్ని కూడా రాజకీయ దుర్బుద్ధితో అడ్డుకోవాలని చూడడం దారుణమన్నారు. చంద్రబాబు కారణంగా ఎన్నికల ఫలితాలు వచ్చేంతవరకు ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఇదంతా చంద్రబాబు కుట్రగా పరిగణించి, రానున్న ఎన్నికల్లో ఆయనకు ఆయన కూటమికి గట్టి బుద్ధి చెప్పాలన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న వలంటీర్ల సేవలను విమర్శించడం, వారిని సంఘ విద్రోహక శక్తులుగా ప్రతిపక్షాలు చూడడం ఎంతమాత్రం సరికాదన్నారు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగాన్ని ఆయన కోరారు.

ప్రజలకు మేలు చేయడం విపక్షాలకు ఇష్టం లేదు..

- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజలకు మేలు చేయడం విపక్షాలకు ఇష్టం లేదని, అందుకే ప్రజలను ఇబ్బందులకు గురిచేసే కార్యక్రమాలు, విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే అలజంగి జోగారావు మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఓడించడం ఎవరి తరమూ కాదన్న విషయం విపక్షాలకు తెలిసిపోయిందన్నారు. ప్రభుత్వం వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు మంచి చేస్తుంటే అటువంటి వ్యవస్థపై లేనిపోని విమర్శలు విపక్షాలు చేస్తున్నాయని, సరిగ్గా పింఛన్ల పంపిణీ సమయానికి వారు(వలంటీర్లు) పింఛన్లు పంపిణీ చేయడానికి వీలులేదని అటు కోర్టుకు, ఇటు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేశాయన్నారు. కోవిడ్ విపత్తు సమయంలో ప్రాణాలకు తెగించి, ప్రజాసేవకు అంకితమైన వలంటీర్లను ఎవరూ మర్చిపోరన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా లబ్ధిదారు వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లను తప్పుబట్టడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రజలకు మంచి జరిగే కార్యక్రమాలకు అడ్డురాకూడదని హితవు పలికారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

పార్వతీపురంటౌన్: పట్టణ ప్రజలంతా ఆస్తి, ఇల్లు, ఖాళీ స్థలాలకు సంబంధించి, పన్నులు సకాలంలో చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ కోరారు. స్థానిక పట్టణంలోని వాణిజ్య సముదాయాల్లో పన్నులు, ప్రాపర్టీ చార్జీల వసూలు చేసే కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూజర్ చార్జీలు, పన్నులు చెల్లించడం ద్వారా పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వీలుంటుందని, అలాగే పట్టణ సుందరీకరణ, పరిశుభ్రతకు అవసరమైన నిధులు సమకూరుతాయన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

సీతానగరం: ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని, మండలంలోని బూర్జ, పెదంకలాం, అంటిపేట, మరిపివలస, జోగింపేట, గుచ్చిమి, జానుమల్లువలస, గాదెలవలస, సీతానగరం, పెదబోగిలి గ్రామ చర్చిల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు పునరుత్థానం చెందిన రోజున ఈ కార్యక్రమం ఏటా నిర్వహిస్తుండడం విశేషం. మత విశ్వాసులంతా ప్రార్థనల్లో పాల్గొని, క్రీస్తు సందేశం గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, సంక్షేమ పాలనను ఆదరించండి



పాచిపెంట : ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాచిపెంట: రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుకు మళ్లీ ఓటేసి, వైఎస్సార్ సీపీ కొనసాగిస్తున్న సంక్షేమ పాలనను ఆదరించాలని ఎంపీపీ బద్నాన ప్రమీల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గురివినాయుడుపేటలో ఆదివారం పర్యటించిన వారికి గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన వారు ఈ ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని, ప్రయోజనాన్ని, మేలును వివరించారు. ఎన్నికల వేళ మోసపూరిత హామీలతో గడప తొక్కే టీడీపీ కూటమి నేతలు నమ్మవద్దని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల సమయంలో ఇచ్చే ప్రతీ హామీని తూ.చ. తప్పకుండా నెరవేర్చే సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలన్నారు.

సాలూరు రూరల్: మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సర్పంచ్ సువ్వాడ శశికళ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం ఆదివారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి, గతంలోని టీడీపీ ప్రభుత్వం చేసిన అన్యాయాలతో పాటు ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. వైఎస్సార్ సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను, పీఏసీఎస్ అధ్యక్షుడు పెద్దింటి మాధవరావు, పార్టీ మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ మాట్లాడుతూ సీఎం జగనన్న ముఖ్యమంత్రిగా ఉంటేనే అన్నివర్గాలకు మేలు జరుగుతుందన్నారు.

కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన ఘనత ఆయనదేనన్నారు. ఇవాళ సాలూరు ఏజెన్సీలోనూ ప్రతీ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం జరిగిందంటే డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవేనన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న రాజన్నదొరను గెలిపించుకుని, సీఎం జగనన్నకు కానుకగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో సువ్వాడ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సాలూరు రూరల్: ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీను, మాధవరావు తదితరులు

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీయే



ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే జోగారావుకు ఘనస్వాగతం పలుకుతున్న మహిళ

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: ప్రజామద్దతుతో మళ్లీ గెలిచి, నిలిచేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక పురపాలక సంఘం పరిధిలోని 25వ వార్డులో ఎమ్మెల్యే అభ్యర్థిగా రెండోసారి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం ఆదివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి, ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు ఎన్నికలలో ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా నెరవేర్చడమే కాకుండా హామీ ఇవ్వని మరెన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసి, రాష్ట్ర ప్రజల జీవన స్థితిగతులను మెరుగుపరిచారన్నారు. విద్య, వైద్య వ్యవస్థల్లో సమూల ప్రక్షాళన చేసి, వేల కోట్ల రూపాయలను ఖర్చు చేసి, నేడు దేశంలోనే గర్వించేలా రాష్ట్రంలోని విద్య, వైద్య వ్యవస్థలను తీర్చిదిద్దారన్నారు. మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యమిస్తూ వారి పేరిట అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఏకైక నాయకుడు మన జగనన్న అని అన్నారు. ఈ ఐదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలితాలే మళ్లీ 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని గెలిపించి తీరుతాయన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రతీ ఇంటికి లబ్ధి జరిగిందని, ఇదే సంక్షేమం, అభివృద్ధి కావాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఎమ్మెల్యేగా తనను, ముఖ్యమంత్రిగా సీఎం జగనన్నను మరోసారి ఎన్నుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, స్థానిక కౌన్సిలర్ సభ్యులు నిమ్మకాయల సుధీర్ కుమార్, రణభేరి చిన్నంనాయుడు, ఏడ్ల త్రినాథ, సువ్వాడ లావణ్య, తాడ్డి శంకరరావు, ఆకుల శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



కారు డిక్కీలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. మండల పరిధిలోని రాష్ట్ర రహదారిలో ఉన్న హనుమాన్ జంక్షన్, జోగింపేట, చినభోగిలి ప్రధాన జంక్షన్‌లలో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు డబ్బు, మద్యం రవాణాపై దృష్టిసారించారు. ఎన్నికల కారణంగా ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నగదు, మత్తు పదార్థాలు, మద్యం వంటివి సరఫరా జరుగుతోందన్న సమాచారం కారణంగా సోదాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిమితికి మించి డబ్బు, మద్యం తరలిస్తే పట్టుకుని, సీజ్ చేస్తున్నామన్నారు. వాహనాల్లో నగదు తరలించాల్సి వస్తే ఎన్నికల అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. రాష్ట్ర రహదారిలోని లచ్చయ్యపేట నుంచి మరిపివలస వరకు ప్రధాన కూడళ్లలో ప్రతిరోజూ తనిఖీలు చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



బగ్గందొరవలస కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

సీతానగరం: వేసవి ఎండల నేపథ్యంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు వీలుగా మండలంలోని అంటిపేట, బగ్గందొరవలస గ్రామాల ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఈవోపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. ఇదే విషయమై ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా ప్రజలెవరూ వడదెబ్బ బారినపడకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు మార్గదర్శకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ మేరకు తీసుకునే చర్యల్లో భాగంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి, తాగునీటి సరఫరాకు ఇద్దరేసి వ్యక్తులను కూడా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శశిభూషణరావు, శ్రీనివాసరావు, జె.వెంకటరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాలాడ తోటల్లో ఏనుగుల గుంపు



తాలాడ తోటల్లోకి చేరిన ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తాలాడ సమీపంలోని తోటల్లో ఆదివారం ఏనుగులు గుంపు చేరి తిష్ట వేసింది. ఫారెస్ట్ అధికారులు, ట్రాకర్స్ వాటి గమనాన్ని పరిశీలిస్తూ గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నారు. వేసవి తాపం పెరగడంతో తాగునీటి కోసం వంశధార నదీ తీరం సమీపంలోకి చేరుకుంటున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ అధికారి లక్ష్మణమూర్తి సూచించారు. గ్రామంలో ఏనుగుల గుంపు తిష్టవేయడంతో తాలాడ రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఫీవర్ సర్వైలెన్స్‌పై ప్రత్యేక దృష్టి



జర్నలో దోమల నివారణకు చేపడుతున్న ఫాగింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ఫీవర్ సర్వైలెన్స్ చేపట్టి మలేరియా, డెంగీ తదితర జ్వరాలను సత్వరమే గుర్తించాలని జిల్లా మలేరియా అధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని దుడ్డుఖల్లు పీహెచ్‌సీ పరిధిలోని జర్న గ్రామాన్ని శనివారం రాత్రి వైద్య బృందంతో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలో దోమల నివారణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. అలాగే ఫీవర్ సర్వైలెన్స్ చేపట్టారు. గ్రామంలో చేపట్టిన జ్వర నిర్ధారణ పరీక్షల నివేదికలను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ.. ఎవరికైనా జ్వరం అనిపిస్తే గ్రామంలో ఉన్న వైద్య సిబ్బందికి తెలియజేయలన్నారు. దోమతెరల వినియోగంపై అవగాహన కల్పించారు. వేసవి ఎండలు అధికమవుతున్నాయని, ప్రజలు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ నీరు, ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఫీవర్ సర్వే చేపట్టాలని, జ్వరాలతో బాధపడుతున్న వారికి సరైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం దుడ్డుఖల్లు పీహెచ్‌సీని సందర్శించి ఓపీ, ల్యాబ్ రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఏఎంఓ సూర్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ నారాయణరావు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులున్నారు.